# ఈ వారం కథ

# దోషులెవరు?

**- శ్యాం**

మార్చి నెలాఖరు. అవి ఎండాకాలం ప్రారంభం రోజులు. సాయంత్రం ఏడయింది.

"జయా! వంట త్వరగా కానీవే. మధ్యాహ్నం తినలేదు. బాగా ఆకలేస్తుంది." రిక్వెస్టుగా అన్నాడు రామారావు.

"ఆఁ... సరే. మధ్యాహ్నం అన్నం ఉంది. బీరకాయ వేపుడు చేస్తాను. ఉండండి." టి.వి. సీరియల్ చూస్తూ అంది.

"అది కాదే! పెరుగైనా చాలు. పచ్చడితో తినేస్తాను. బాగా ఆకలిగా ఉంది."

"అబ్బబ్బా! మధ్యాహ్నం మీకెవడు తినొద్దన్నాడు. స్నానం చేసి రండి. ఈలోపు బీరకాయ వండుతాను" అయిష్టంగా టి.వి. ఆఫ్ చేసి, కత్తిపీట బీరకాయలు తెచ్చుకొని తరగడానికి కూర్చుంది. అంతలో.

"వదినా"అంటూ చేతిలో టిఫిన్ బాక్స్ పట్టుకుని వచ్చింది లక్ష్మి.

"ఏం" వెటకారం ధ్వనించింది జయ కంఠంలో.

"మీ తమ్ముడు డ్యూటీ దిగి వస్తూ చేపలు తెచ్చారు. అన్నయ్యకిష్టమని చేపల పులుసు తెచ్చాను. అన్నయ్య ఉన్నాడా!" ఆత్రంగా అడిగింది.

"ఉన్నారమ్మా! స్నానం చేస్తున్నారు. మీ అన్నయ్య కోసమే ఈ బీరకాయలు కోస్తున్నాను. చేపల పులుసు తెచ్చావుగా. ఇంక ఈ బీరకాయలు ఏం తింటాడు" ఉహుఁ అని విసురుగా కత్తిపీటని, బీరకాయల్ని పక్కకి తోసింది.

వదిన మాట తీరు అంతేనని ఎంత సర్దుకున్నా ఈమధ్య మరీ ఎక్కువగా మాటలతో హింసిస్తుంది. మ్లానమైపోయింది లక్ష్మిమొఖం. "వస్తానొ దినా"అంటూ టిఫిన్ బాక్స్‌ని టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయింది.

విననట్లు మొఖం పక్కకి తిప్పేసుకుంది జయ.

"జయా! ఎవరొచ్చారు? లక్ష్మీనా?" స్నానం నుండి వస్తూ అడిగాడు రామారావు.

"అబ్బా! ఏం చెవులు బాబూ! అక్కడెక్కతో స్నానం చేస్తున్న మీకు, మీ చెల్లి రాక తెలిసిపోయిందా" కావాలనే ఎత్తిపొడుస్తూ అంది.

"అంటే లక్ష్మీనా! ఏది? మరి నేనొచ్చేవరకు ఉండలేదేం. ఎందుకు వచ్చింది?"

"బాబూ! ఇదిగో నీ చెల్లెలు నీకోసం చేపల పులుసు తెచ్చింది. తీసుకో" అని చేతిలో బాక్సు పెట్టింది.

రామారావు మొఖం సంతోషంతో విప్పారాయి. నోట్లో నీళ్ళూరాయి.

"రారా. వేగం అన్నం పెట్టు. బాగా ఆకలేస్తుంది."

జయ మొగుడి వైపు కొరకొరా చూసింది.

పళ్ళెంలో అన్నం వడ్డించింది. బాక్సు మూత రామారావు తెరిచాడు. కూర ఘుమ ఘుమలాడుతుంది. బాక్సులో ఆరేడు ముక్కలున్నాయి.

"నాకు రెండు ముక్కలు చాలు. నువ్వు, రాజేష్ తినండి" అన్నం కలుపుకుంటూ అన్నాడు.

"వద్దులే. నీ చెల్లెలు నీకోసమే తెచ్చింది. నువ్వే తిను. నా కొడుకు, నేను ఏదో తింటాంలే" అంది మొండిగా.

"లక్ష్మి చేపలు ఎంత బాగా చేస్తుందే. అది చేపలు వండినట్లు, నువ్వు వండ లేవు. తెలుసా" ఉడుక్కుంటున్న జయని ఇంకా ఉడికించాడు.

"ఆఁ... ఈ కూరలు, పులుసులతోనే మనుష్యులని కట్టేసుకుంటుంది" కోపంగా అంది.

"ఎందుకే అదంటే అంత చులకన. ఏదో ఆశపడి అడిగింది. మనం కాదన్నాం. అయిపోయింది. నా లక్ష్మి నీలాగా మనసులో పెట్టుకోదు. ఎప్పుడో మర్చిపోయింది. ఇంకా నువ్వేందుకు పట్టుకు వ్రేలాడుతావు." కాస్త కటువుగా అన్నాడు.

జయ ఇంకేం మాట్లాడలేదు. మొత్తం చేపల కూరతో అన్నమంతా తృప్తిగా తిన్నాడు. కడుపు కాస్త భారీగా అన్పించింది.

"నేను వెళ్ళి పడుకుంటాను. తర్వాత దుప్పటి, చెంబుతో నీళ్ళు పెట్టు"అని చెప్పి మేడ మీదకి వెళ్ళిపోయాడు.

జయ ఎంగిలి పళ్ళెం తీసింది సణుక్కుంటూ.

❖ ❖ ❖



బైకు దిగి చుట్టూ చూశాడు ఇనస్పెక్టర్ అవినాష్. కానిస్టేబుల్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఎక్కడుందీ శవం?"

"మేడ మీద సార్" కానిస్టేబుల్ బాబురావు అన్నాడు.

మేడ పైనుండి ఆడవాళ్ళ ఏడుపు వినిపిస్తున్నాయి. ఆ ఇంటి చుట్టూ జనం ఉన్నారు.

ఇన్‌స్పెక్టర్ అవినాష్ మేడపైకి వెళ్ళాడు.

"మనిషి పడుకున్నట్లే ఉన్నాడు" మనసులో అనుకున్నాడు.

"సార్! ఇతని పేరు రామారావు. రాత్రి భోజనంచేసి వచ్చి పడుకున్నాడు. ఉదయం ఆరు గంటలకి వాళ్ళ బ్బాయి రవి వచ్చి లేపబోయాడు. వొళ్ళు చల్లగా తగలగానే గట్టిగా కేకలు వేసాడంట" అంటూ రవిని చూపించాడు.

పాతిక సంవత్సరాలుంటాయేమో రవి తెల్లగా, పొడవుగా హుందాగా ఉన్నాడు. బాగా ఏడ్చినట్లు, ఎర్రగా కందిపోయిన మొఖమే చెపుతుంది.

ఏడుస్తూ గుండెలు బాదుకుంటున్న ఆమెవైపు చూసాడు. "ఎవరీమె" అన్న ప్రశ్నార్ధకం అవినాష్ మొఖంలో.

అది గమనించి "సార్! ఆవిడ అతని భార్య జయ. రాత్రి తొమ్మిది గంటలకి పైకి వచ్చి నీళ్ళు, దుప్పటి ఇక్కడ ఉంచి వెళ్ళిందంట" అన్నాడు. "అప్పుడు మంచి నిద్రలో ఉన్నాడని అంటుంది. ఇంతకుమించి ఇంకేం చెప్పలేదు సార్."

అవినాష్ శవం వంక పరీక్షగా చూసాడు. నోటినుండి నురగ బయటకు వచ్చింది. బాధవల్ల అటూ ఇటూ కదిలి ఉంటాడు. కింద పరిచిన దుప్పటి అస్తవ్యస్తంగా ఉంది. చెంబులో నీళ్ళు అలానే ఉన్నాయి. దుప్పటి కూడా ఆవిడ పెట్టింది పెట్టినట్లే ఉంది.

"చూస్తుంటే ఇది పాయిజినింగ్ కేసులా ఉంది. పోస్టు మార్టమ్ చేస్తే గాని ఇది హత్యో, ఆత్మహత్యో అన్నది కరెక్టుగా తెలియదు." బాబురావుతో అన్నాడు అవినాష్.

"లేదు సార్! మా బావకి ఆత్మహత్య చేసుకునే అవసరం లేదు. సంతోషంగా ఉన్నాడు. హత్యంటారా! హత్యకి అవకాశమే లేదు. అతనికి శత్రువులెవరూ లేరు. చాలా మంచివాడు సార్."

"మీరు... ఆయనకేమవుతారు." అవినాష్ ప్రశ్నించాడు.

"ఆయన బావమరిదినండి. రమణమూర్తి నా పేరండీ".

"ఇనస్పెక్టర్ గారూ! నేను చెపుతానండి. నాకు ఇప్పుడంతా అర్ధమయింది. అతనికి శత్రువులు ఎందుకు లేరూ... ఉన్నారు. ఇదిగో ఈ పాపిష్టిది ఉంది." లక్ష్మి వైపు చేయి చూపిస్తూ ఆవేశంగా అంది జయ అవినాష్‌తో.

లక్ష్మితో సహా అక్కడున్న వాళ్ళంతా విస్తుపోయారు.

"ఇదిగో ఈ లక్ష్మి నిన్న, అన్నకోసం చేపల కూర తీసుకొచ్చింది. అది తినేసి పైకి వెళ్ళి పడుకున్నాడు. మరింక లేవ లేదు. ఇదే కూరలో ఏదో కలిపి తెచ్చింది. మొగుడు, పెళ్ళాలు ఇద్దరూ కలిసి నాటకాలాడుతున్నారు." ఏడుస్తూ అంది.

"వదినా! అంత మాట అనకు. అన్నని నేను చంపుకుంటానా. నాకు అమ్మ, నాన్న వాడే. నామీద అంత అభాండం వేయకు" బావురుమంది లక్ష్మి.

"అన్నయ్య! లే అన్నయ్య ఒక్కసారి లే అన్నయ్య! చూడు వదిన ఏమంటుందో. నేను నిన్ను చంపుకున్నానా! ఇలాంటి రోజు వస్తాదనుకోలేదు. లే అన్నయ్యా..." రామారావు (శవం) కాళ్ళు పట్టుకొని ఏడ్చింది.

"ఛీ! పాపిష్టిదానా! లే. ఎంత నాటకాలాడుతున్నావే. పో. ముట్టకు" జయ పూనకం వచ్చినట్లు ఊగిపోతోంది.

"అమ్మా! ఊరుకో అమ్మా! ఏమిటో మాటలు" రవి వచ్చి అనునయిస్తున్నాడు.

"నీకు తెలీదురా. నీ అత్తేరా... మీ నాన్నని చంపింది"అంటూ సొమ్మసిల్లి పోయింది.

"చూడండి. పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చేవరకు ఏమి చెప్పలేము" అని చెప్పి అవినాష్ వెళ్ళిపోయాడు.

శవాన్ని ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టమ్ చేసాక సాయంత్రం తిరిగొచ్చిన శవానికి కర్మకాండలు చేసారు. రామారావు ఇంట్లోని వాళ్ళంతా లక్ష్మిని చూపులతో, మాటలతో గుచ్చుతుంటే అక్కడ ఉండలేక వాళ్ళింటికి వచ్చేశారు.

మరుసటిరోజు మధ్యాహ్నం ఇన్‌స్పెక్టర్ రామారావు ఇంటికి వచ్చాడు. ఇంటిల్లిపాది "రిపోర్ట్స్ వచ్చాయా! ఏమి తెలిసింది సార్!"అని ఆత్రుతగా అడిగారు.

అవినాష్ నెమ్మదిగా అన్నాడు. "అతను తిన్న ఆహారంలోనే విషం కలిసింది..."

అతని మాటలు పూర్తవ్వకముందే "అయ్యో! నేనప్పుడే చెప్పానా! లక్ష్మీ చేసింది" ఏడుస్తూ అంది.

"వూరుకొండమ్మా! ఇది చెప్పండి. లక్ష్మి ఎందుకు చేస్తుంది. ఏమైనా ఆస్తి గొడవలున్నాయా?" ప్రశ్నించాడు.

"లేదండీ! ఆమధ్య దాని కూతుర్ని, నా కొడుక్కి చేసుకోమని అడిగింది. అది జరిగే పని కాదని ఖరాఖండిగా చెప్పేశాము. అప్పుడునుండి దానికి మా మీద కక్ష. అది ఇలాగా తీర్చుకుంది." కళ్ళు తుడుచుకుంటూ అంది.

"వాళ్ళ ఇల్లు ఎక్కడ?"అంటూ బయటకు వచ్చాడు. అదే వీధిలో చివర్న ఉంది వాళ్ళ ఇల్లు.

లక్ష్మి "పోలీసులని చూసి కంగారుగా అడిగింది" ఏమయిందని.

జరిగింది చెప్పాడు అవినాష్.

"లేదండీ నేను మా అన్నని చంపలేదు. ఈయన డ్యూటీనుంచి వస్తూ చేపలు తెచ్చారు. అవే వండి తీసుకెళ్ళాను. నేనేమీ కలపలేదు. నన్ను నమ్మండి" తల కొట్టుకుంటూ ఏడ్చింది.

"ఇల్లు సెర్చ్‌చెయ్యాలని రమణమూర్తికి చెప్పాడు. ఇంట్లో వెళ్ళిన పోలీసులకి పురుగుల మందు డబ్బా దొరికింది."

అది చూసి "ఇది మొన్ననే మా పాలేరు కొన్నాడు. పొలంలో చల్లి, మిగిలింది తీసుకొచ్చాడు" రమణమూర్తి అన్నాడు.

"రాక్షసి! ఎంత పని చేసావు. మా నాన్నని చంపేశావు. నీకు ఏ ద్రోహం చేసాడు నాన్న. మా అమ్మ అంటూనే ఉంది. నేనే నమ్మలేదు" రవి విరుచుకు పడ్డాడు.

"మాటలు సరిగ్గా రానీ బావా! మా అమ్మ అన్నయ్య కోసం ప్రాణాలు ఇచ్చేదే. కాని తీసేది కాదు. అనవసరంగా నోరు పారేసుకోకు." ఇరవై ఏళ్ళ అమ్మాయి ఉక్రోశంగా అంది.

"మీ అమ్మ కాకపోతే నువ్వు చేసి ఉంటావు ఈ పని"

"మావయ్య మాకు దేవుడు లాంటివాడు. అతన్ని చంపాల్సిన అగత్యం మాకు లేదు. ఉందిగా మీ ఇంట్లో, మీ అమ్మ తాటకి. వెళ్ళి అడుగు. ఆమేం చేసిందో. మాటలతో చిత్రవధ చేస్తుంది. ఇప్పుడు ఆవిడే అంతాచేసి మా మీద నెట్టేస్తుంది."

"లావణ్యా! నోర్ముయ్! ఏమిటా మాటలు?" లక్ష్మి కోపంగా అంది.

"ఎంత బాగా తల్లీ కూతుళ్ళు నటిస్తున్నారు" రవి మండిపడ్డాడు.

"స్టాపిట్! మీ వాదనలు ఆపండి. ఈవిడ స్వయంగా తెచ్చి ఇచ్చింది కాబట్టి అనుమానంతో లక్ష్మిని కస్టడీలోకి తీసుకుంటున్నాం. అలా అని ఆమె నేరం చేసిందని ఇప్పుడే చెప్పలేము. కేసు దర్యాప్తు చేస్తున్నాం. కొత్త విషయాలు బయటకు వస్తాయి" స్థిరంగా అన్నాడు అవినాష్.

"సార్! అది అమాయకురాలు సార్! ఎప్పటిలాగే నేను తెచ్చిన చేపలు వండి అన్నకి ఇష్టమని తీసుకెళ్ళింది. నలుగురికి కడుపు నింపడమే కాని కడుపు కొట్టడం మాకు తెలియదు సార్! ప్లీజ్ సార్!" కన్నీళ్ళతో వేడుకున్నారు రమణమూర్తి, లావణ్య.

కాని, అవినాష్ తన డ్యూటీ తాను చేసుకుపోయాడు.

సాయంత్రం రమణమూర్తి పోలీస్‌స్టేషన్‌కి వచ్చాడు. భార్యతో మాట్లాడాలన్నాడు.

భర్తని చూడగానే భోరుమంది లక్ష్మి. ఆమెని దగ్గరకు తీసుకొని అనునయించాడు.

కొంత సేపటి తర్వాత "ఎందుకు చేశావు లక్ష్మీ ఈ పని!" విచారంగా అన్నాడు.

చివ్వున తలెత్తి "ఏంటి! అంటున్నావు? మీరు నమ్మడం



"మావయ్య మాకు దేవుడు లాంటివాడు. అతన్ని చంపాల్సిన అగత్యం మాకు లేదు. ఉందిగా మీ ఇంట్లో, మీ అమ్మ తాటకి. వెళ్ళి అడుగు. ఆమేం చేసిందో. మాటలతో చిత్రవధ చేస్తుంది. ఇప్పుడు ఆవిడే అంతా చేసి మా మీద నెట్టేస్తుంది."

లేదా! నేను అన్నయ్యని చంపడమేంటీ? అయ్యో దేవుడా! గాద్గిక స్వరంతో అంది" మీరు ఇలా చేశారేమోనని నేను అనుకుంటున్నాను."

"లేదు. లక్ష్మి! బావ చాలా మంచివాడు. మనకో దారి చూపించాడు. మనమే మన తాహతు మరిచిపోయి సంబంధంకోసం ఆశపడ్డాం. వాళ్ళు కాదన్నారు. మొదట్లో బాధపడినా అది మర్చిపోయాను. బావమీద నాకు కోపం లేదు."

మరైతే ఎవరు చేసారు. "లావణ్య... గాని" నసిగింది.

"ఛ అది ఎందుకు చేస్తుంది. అది కాదు. నేను దాన్ని అడిగే వచ్చాను. అది చాలా బాధపడింది" రమణమూర్తి బాధగా అన్నాడు.

కూతుర్ని అనుమానించినందుకు ఒక్క క్షణం బాధపడింది.

"మరయితే ఇదేంటి ఈ కుట్ర. ఎవరు చేసారు". ఒకింత కంగారుగా అంది.

వాళ్ళకు తెలియని విషయం ఒకటుంది. వాళ్ళు అక్కడ మాట్లాడుకున్న మాటలన్నీ టేపు చేయబడ్డాయని.

* * *

రాత్రి ఎనిమిదయింది. బాగా అలిసిపోయి ఉన్నాడు అవినాష్. కళ్ళముందు లక్ష్మి రూపం కనబడుతుంది. ఆమె నిర్దోషని తెలిసిపోతుంది. ఆమె కాదు. అటువైపు కూడా ఎవరికి రామారావుని చంపాల్సిన పనిలేదు. అందరూ అతని మీదే ఆధారపడి ఉన్నారు. అతను చనిపోవడంవల్ల భార్యకు గాని కొడుక్కి గాని లాభం లేదు. ఏ వీలునామా రాయలేదు. మరి ఏంటో మిస్టరీ?" ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది.

ఇంటికి వస్తూనే "హాయ్ బేబీ!" అని పాపని ముద్దాడి, వసంతా! బాగా ఆకలేస్తుంది. స్నానం చేసి వస్తాను. వడ్డించెయ్! అన్నట్లు ఏంటీ ఈరోజు స్పెషల్!" అన్నాడు.

"చేపల పులుసు."

"వ్వాట్" గట్టిగా అరిచాడు.

ఉలిక్కిపడి "ఏమైందీ... మీకిష్టం కదా"అంది ఆశ్చర్యపోతూ.

"ఏం...వేసి వుండావూ..."

"ఆ... ఎండ్రిన్ వేసాను..." చిరు కోపంగా అంది.

"అయితే నువ్వే తిను."

"నేను ఇంకేం కూర చెయ్యలేదు."

"పోన్లే. పచ్చడి మెతుకుల తింటాన్లే." అని బాత్రూమ్‌లో దూరాడు.

"మీతో చచ్చిపోతున్నాను. మీకు ఎప్పుడు, ఏది ఇష్టమో తెలిసి చావడం లేదు."

కాలింగ్ బెల్ మ్రోగడంతో తలుపు తీసింది.

"రావయ్యా రా! సమయానికి వచ్చావు" కానిస్టేబుల్ బాబూరావుని చూసి అంది.

"అది... మేడమ్! సార్‌కి ఈ రిపోర్టు ఇచ్చి వెళదామని..." నసిగాడు.

"సర్లే. మీ పన్లకి వేళాపాళా ఉందేంటీ: అది సరే మీ సార్‌కి ఇష్టమని చేపలు వండాను. తినరంట. రేపు శనివారం. తినము. నీకు బాక్సులో కట్టేసి ఇస్తాను: ఇంటికి తీసుకెళ్ళు."

"అయ్యో చేపలా! వద్దండీ."

"అదేంటీ నువ్వూ అలాగే అంటున్నావు. ఏంటి విషయం" కోపంగా అడిగింది.

"మరే... ఇదండీ సంగతీ అంటూ టూకీగా కేసు సంగతి చెప్పాడు."

"అయితే... ఏంటంటావ్! నేను ఇందులో ఏదో కలిసానా!"

"అబ్బే... అది కాదండీ."

"ఏంటోయ్! ఇప్పుడొచ్చావు" అవినాష్ స్నానం చేసి వచ్చాడు.

"ఫింగర్ ప్రింట్స్ రిపోర్ట్స్ సార్! నువాక్రాన్ డబ్బామీద లక్ష్మివి, వాళ్ళ పాలేరువి ఫింగర్ ప్రింట్స్ ఉన్నాయండి"అని రిపోర్టు చూపించాడు.

రిపోర్టు చూస్తూ ఎందుకో తన నాలుగేళ్ళ పాపవైపు చూసాడు.

"బేబీ! ఏం చేస్తున్నావురా" అక్వేరియంని పరిశీలనగా చూస్తున్న పాపని అడిగాడు.

"డాడీ! వన్ ఫిష్ డెడ్." అంది ముద్దుముద్దుగా.

"ఇదెక్కడి చేపల గోల" గొణుక్కున్నాడు కానిస్టేబుల్ బాబురావు.

"ఏదీ"అని లేచి వెళ్ళి చూసాడు. ఒక గోల్డ్‌ఫిష్ చచ్చిపోయి నీటిపై తేలి ఉంది. నెట్ తెచ్చి దాన్ని తీసాడు. వెంటనే అవినాష్ మొఖంలో ఏదో సంతోషం.

"రావోయ్! బాబూ! భోజనం చేద్దాం" హుషారుగా అన్నాడు.

"వద్దండీ."

"మీ మేడమ్ చేపలు బాగా వండుతుంది. టేస్ట్ చేద్దువుగాని"

"అబ్బే... ఎందుకులెండి" నసిగాడు.

(మిగతా 27వ పేజీలో)

**(21వ పేజీ తరువాయి)**

"ఏం. ఫర్వాలేదు. కూర్చో. నేను తింటానోయ్"అంటూ కబుర్లు చెపుతూ భోజనం ముగించాడు. అవినాష్‌లో వచ్చిన మార్పుకు కారణమేమిటో బాబురావుకి బోధపడ లేదు.

"బాబూ! నువ్ ఇంటికి వెళ్ళేముందు రమణమూర్తి దగ్గి రకు వెళ్ళు. రేపు ఎనిమిది గంటలకు నేను వస్తాను. రెడీ అయి ఉండమను. బయటకు వెళ్ళాలి అని చెప్పు. అంతే. గుడ్‌నైట్"అని చెప్పాడు. బాబు వెళ్ళిపోయాడు. రాత్రి హాయిగా పడుకున్నాడు అవినాష్.

❖ ❖ ❖

ఉదయం అవినాష్ సివిల్ డ్రస్సులో బైక్‌మీద లక్ష్మి వాళ్ళింటికి వెళ్ళాడు. అప్పటికే రమణమూర్తి తయారయి కూర్చున్నాడు.

"ఏమిటీ సార్! ఎక్కడికి" రమణమూర్తి గొంతులో ఆందోళన. లావణ్య కళ్ళలో నీళ్ళు.

"ఏం భయం లేదు. అంతా ఇన్వెస్టిగేషన్‌లో భాగమే. మీ అమ్మ నిర్దోషి అని నాకు తెలుసు. రుజువు చెయ్యా లిగా" లావణ్య తల నిమిరాడు.

"థాంక్యూ సార్! కనీసం మీరైనా నమ్మారు!" ఏడుస్తూ అంది.

"చూడండి మూర్తిగారూ! మీరు డ్యూటీనుంచి వస్తూ చేపలు తెచ్చామన్నారు కదా. ఎక్కడ కొన్నారు" విషయం లోకి వస్తూ అడిగాడు.

"నేను కూనేరులో రైల్వే గాంగ్‌మాన్‌గా చేస్తున్నాను. సాయంత్రం అక్కడ స్టేషన్ దగ్గరలోని ఓ చేపలామె దగ్గరే ఎప్పుడూ కొంటాను. ఆరోజు ఆమె దగ్గరే కొన్నాను. తర్వాత పాసింజర్ వస్తే అందులో ఇంటికి వచ్చేశాను."

"కూనేరుకి ఇక్కడనుండి అరగంట కదూ ట్రెయిన్ జర్నీ."

"ఔను సార్!"

"సరే! బైక్ మీద వెళదాం పద"అన్నాడు. బైక్ మీద ఒక గంట జర్నీ తరువాత కూనేరు చేరుకున్నారు.

అక్కడ చేపలామె ఉంది. రమణమూర్తి ఆమెని అవినా ష్‌కి చూపించాడు. పొట్టిగా, నల్లగా ఉంది. మాతృభాష ఒరియా అయినా తెలుగు బాగానే మాట్లాడుతుంది. అవి నాష్, రమణమూర్తిని చూపిస్తూ "ఈయన నీకు తెలుసా"అని అడిగాడు.

"ఈ బాబు ఎప్పుడూ ఇక్కడే కొంటారు సార్! పెద్ద ఫ్యామిలి అంట. ఎక్కువ కొంటారు" అంది.

"మొన్న చేప అమ్మావు కదా అది ఎక్కడిది?" రమణ మూర్తి అడిగాడు.

"అంటే, ఎప్పుడూ నేను తెచ్చినవే అమ్ముతాను. అప్పు డప్పుడు ఇక్కడ పిల్లలు చెరువుల్లో పట్టుకొచ్చి ఇస్తారు. ఆళ్ళకి ఏదో కొద్దిగా డబ్బులిచ్చి తీసుకుంటాను" సిగ్గుప డుతూ అంది.

"ఆ చేప ఎక్కడిది..."

"అదా..." కొంతసేపు గుర్తుచేసుకుంది. "ఆఁ... ఆరోజు ఇద్దరు కుర్రాళ్ళు రెండు చేపలు పెద్దవి తెచ్చారు. వాళ్ళ దగ్గర తీసుకున్నాను. ఒకటి వెంటనే ఒక పెద్దాయన కొనే శాడు. ఇంకొకటి ఈ బాబు ఎల్లిపోతా ఉంటే, నేనే పిల్చి కొనిపించా. డబ్బుల్లేవు. వద్దులే అన్నారు. కాని నాను ఒగ్గుతానా! ఈసారి ఇద్దురులే, మంచి చేప బాబు అని టకాటకా ముక్కలు చేసి బాబుగారి చేతిలో పెట్టాను. ఆ సేపలకి నాకింకా ఇరవై రూపాయలు బాకీ ఉన్నారు సారూ" అంది.

"ఇదిగో ఆ ఇరవై"అని రమణమూర్తి ఇరవై నోటు అందించాడు.

"నీకు చేపలు తెచ్చిన పిల్లలు ఎక్కడుంటారో చూపెడ తవా!" అవినాష్ అడిగాడు.

పోలీసని తెల్సి, తప్పనిసరిగా లేచి కదిలింది. అటు ఇటు రెండు, మూడు మలుపుల తర్వాత క్రికెట్ ఆడుతున్న పిల్లల దగ్గరకి తీసుకెళ్ళింది. అందరూ తైల సంస్కారం లేని బుర్రలతో చినిగిన బట్టలతో, స్నానాలు చేసి వారాలు గడిచిపోయినట్లు ఉండే వాళ్ళ మొఖాలు... రమారమి అందరూ అలాగే ఉన్నారు. అందులో ఇద్దరిని చూపించి వాళ్ళే అంది. చేపలామె.

ఇద్దరికి పదమూడు, పద్నాలుగేళ్ళు ఉంటాయి. వాళ్ళు భయపడి పారిపోబోయారు. కాని అవినాష్ వాళ్ళని ఒడు పుగా పట్టుకున్నాడు. "మీకేం కాదు"అని చెప్పినా వాళ్ళకు అర్థం కాలేదు.

రమణమూర్తి తనకొచ్చిన హిందీ, ఒరియాలో కలిపి అడిగాడు. "చేపలు ఎక్కడ నుండి తెచ్చారు"అంటే "దగ్గర చెరువులోనివని" వాళ్ళన్నారు.

కాని ఆ చేపలామె "ఆ చెరువులో అంత చేపలు లేవురా. నిజం చెప్పండి". అని నాలుగు తిట్టింది.

"పట్నాయక్ వాళ్ళ చెరువులోనివి. చేపలు చచ్చి పైకి తేలుతుంటే, అవి పట్టాము. ఇంకా పట్టాలనుకున్నాము. కాని, ఆ ఇంటి వాళ్ళు అరుస్తుంటే పరిగెత్తుకొచ్చాము. అవే నీకిచ్చాము" అన్నారామెతో.

"సాలే. కుత్తే, ఆద్మీ... చచ్చిన చేపలు నాకమ్మారా!" ఇద్దరినీ నాలుగు బాదింది.

వాళ్ళని తీసుకొని పట్నాయక్ వాళ్ళ ఇంటికి వెళ్ళారు. ఇల్లు చాలా పెద్దదే. ఇంటి వెనుకన చిన్న చెరువు, పట్నా యక్‌కి ఓ యాభై ఏళ్ళు ఉంటాయి. ఛామన చాయగా ఎత్తుగా, ఆరోగ్యంగా ఉన్నాడు.

"చేపలు తినబట్టే ఈ ముసలాడు ఇంత దృఢంగా ఉన్నాడు." మనసులో అనుకుంటూ నవ్వుకున్నాడు.

వీళ్ళని చూసి పట్నాయక్ "జీ...క్యా బాత్‌హై! ఆప్ కౌన్ హై!"అని అడిగాడు.

రమణమూర్తి హిందీలో అతనికి అర్థమైనట్లు చెప్పాడు. దానికాయన "మా ప్రత్యర్థులు కొందరు చెరువులో విషం మొన్న రాత్రి కలిపారు. తెల్లవారేటప్పటికి చేపలన్నీ చచ్చిపోయి ఉన్నాయి. పనివాళ్ళను పిలిపించి, క్లీన్ చేయించేసరికి మధ్యాహ్నమయింది. ఈ పిల్లలు అవి దొంగిలిస్తుండగా, మా వాళ్ళు అరిచారని" జరిగిన సంగతి వివరించాడు. ప్రత్యర్థుల మీద పోలీస్‌స్టేషన్‌లో ఎఫైర్ నోట్ చేసామని చెప్పాడు. కొన్ని చేపలని లేబ్‌కి పంపించారని చెప్పాడు.

అవినాష్ పోలీస్‌స్టేషన్ వెళ్ళి లాబ్ రిపోర్టు చూసాడు. అక్కడ, ఇక్కడ వచ్చిన రిపోర్టు ఒక్కటే. అదే మందు. చిక్కుముడి వీడిపోయింది. అందరికి థాంక్స్ చెప్పాడు.

అంతలో చేపలమ్మి "సార్! అదిగో ఇంకో చేప కొన్న పెద్దాయన" అని చూపిస్తూ, "సారూ! రండి, రండి మంచివి తాజా చేపలు."

"తల్లీ నీకో దండం. నీ చేపలకో దండం. మొన్న తీసు కెళ్ళిన చేప తిని, ఇంట్లో అందరికి వాంతులు, విరోచ నాలు"అని వడివడిగా వెళ్ళిపోయాడు.

బిక్క చచ్చిపోయింది చేపలమ్మి. ఫకాలున నవ్వాడు అవినాష్.

"సార్! మరి మా బావకి అలా వాంతులో, విరోచనాలో అవలేదు. ఎందుకు చనిపోయాడు?" విచారంగా అన్నాడు రమణమూర్తి.

"మూర్తీ! మీ ఆవిడ వండిన దాంట్లో సగం తీసుకువె ళ్ళింది. మీ బావ మొత్తం తానే తిన్నాడు. ఉదయంనుండి ఏమి తినకపోవడంవల్ల, నిద్రలో ఉండడంవల్ల అతని మీద బాగా ప్రభావం చూపింది. మీరు కొద్దిగా తినడం వల్ల మీకు కాస్త వికారాలతో తగ్గిపోయింది" వివరిం చాడు.

"సార్! నాదో డౌటు" మీకు ఇక్కడకు రావాలనే అయి డియా ఎందుకొచ్చింది."

"చిన్నప్పుడు ఎక్కడో చదివాను. ఒరిస్సా, బెంగాలులో ఇంటి దగ్గర చిన్న చేపల చెరువులుండడం, ప్రత్యర్థులు వాళ్ళ కోపాలని చేపల చెరువుల్లో చూపించడం, ఫలి తంగా కుప్పలుగా చేపలు చచ్చిపోవడం, వేలల్లో లక్షల్లో నష్టాలు రావడం. ఇవన్నీ చదివాను. నువ్వు ఇటువైపే పని చేస్తుండడంతో నాకెందుకో డౌటు వచ్చింది. ఒకసారి ప్రయత్నిస్తే పోలే. అనుకున్నా. నా అంచనా కరెక్టు అయింది. లక్ష్మి నిర్దోషి. దట్స్ ఇట్" హుందాగా బైక్ స్టార్ట్ చేసాడు.

"యూ ఆర్ రియల్లీ గ్రేట్ సార్!" మనసులోనే అభినం దించాడు రమణమూర్తి. ★




